ఈపీడీసీఎల్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీజీఎంలు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలు మరువలేనివని, ఆయన జీవితం ప్రతి ఇంజనీర్‌కు ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, బి.అశోక్ కుమార్, ఎస్.రాజాబాబు, బి.శ్రీదేవి తదితరులు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడ్డా దిష్టిబొమ్మ దగ్ధం

విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రస్తావించకపోవడంపై ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నిరసన

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ పర్యటనలో స్టీల్ ప్లాంట్ గురించి ప్రస్తావించకపోవడంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిష్టిబొమ్మను ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఒక్క మాట కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పదవీ వ్యామోహంతో రాజకీయ భిక్ష పెట్టిన విశాఖకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటీకరిస్తామని కేంద్రం చెబుతోందని, అలాంటిదేమీ లేదని రాష్ట్ర ప్రజా ప్రతినిధులు చెప్పడం విడ్డూరమని అన్నారు. స్టీల్‌ప్లాంట్లో వేలాదిమంది కార్మికులను తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 43 విభాగాలకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఆహ్వానించారని తెలిపారు. ఇది ప్రైవేటీకరణ చేయడం కాదా? అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు అడగకుండా అనకాపల్లిలో మెట్టల్ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని ప్రజా ప్రతినిధులు అడగడం దారుణమని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.మధు రెడ్డి, కెల్ల రమేష్, హేమానంద్, గ్రేస్ ప్రకాష్, దేవుడమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే కూటమి లక్ష్యం

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు స్పష్టం చేసారు. సోమవారం ఎంపీపీ మధుపాడ నాగమణి అధ్యక్షతన జరిగిన పెందుర్తి మండలం ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం పరిధిలో నగరపరిధి ప్రాంతాలతో పాటు పల్లెలను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను ప్రస్తావించారని, వాటిని పరిష్కరించడానికి సంబంధిత అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, మండల అభివృద్ధి అధికారి వెంకట్రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యర్థాలను నిత్యం పరిశుభ్రపరచండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ సాగర తీరం వెంబడి బీచ్‌లో వ్యర్థాలు లేకుండా నిత్యం పరిశుభ్ర పరచడంతోపాటు బీచ్ స్వీపింగ్ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన నూతన బీచ్ స్వీపింగ్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఎంతో సుందరమైన విశాఖ సాగర తీరానికి పర్యాటకులు, సందర్శకులు ఎంతోమంది వస్తారని వారికి ఆహ్లాదం, ఆనందాన్ని అందించవలసిన బాధ్యత జీవీఎంసీపై ఉందన్నారు. కోస్టల్ బ్యాటరీ నుండి భీమిలి వరకు ఎక్కడ వ్యర్థాలు కనిపించకూడదని నిత్యం జోనల్ కమిషనర్ల పరిధిలో సాగర తీరంలోని బీచ్‌లో వ్యర్థాలు లేకుండా బీచ్ స్వీపింగ్ యంత్రాలు విధులు నిర్వహించేలా ఆయా జోనల్ కమిషనర్లు పూర్తిగా సూక్ష్మ పరిశీలన చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్వీపింగ్ యంత్రాల పనితీరును నిత్యం పరిశీలించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్‌ను ఆదేశించారు. ఆటుపోట్లు అధికంగా వచ్చిన సమయా లలో వ్యర్థాలు సముద్ర తీరం అధికంగా వెంబడి వస్తాయని, ఆయా సమయాలను గమనించి ముందస్తు ప్రణాళికలతో వ్యర్థాల సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఫామ్ టెక్ ప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజనీరు రత్నాకర్ రెడ్డి,సహాయక వైద్యాధికారులు బి.ప్రసాదరావు, కృష్ణంరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర - మధురవాడ: సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతి సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం ఆయనకు ఘన నివాళులర్పించింది. విశ్వవిద్యాలయంలోని విశ్వేశ్వరాయ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గీతం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరాయ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ నేటి తరం యువ ఇంజనీర్‌లు జాతి నిర్మాణంలో పాలు పంచుకోవాలని, ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యులు కావాలని, సమకాలీన సాంకేతిక పరిజ్ఞానంతో అవకాశాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గణితశాస్త్రం, సైన్స్ ఆధారంగా ఎన్నో ఇంజనీరింగ్ అద్భుతాలను సృష్టించవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులకు ఈ విజయాలు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు.

తెలుగుదేశంలో తెలుగు ద్వేషం తగదు

- అసెంబ్లీ సమావేశాల్లో మాతృభాష పరిరక్షణ ఉద్యమాన్ని చూస్తారు
- తెలుగు దండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి హెచ్చరిక

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగుదేశంలో తెలుగు ద్వేషం తగదని తెలుగు దండ వ్యవస్థాపక అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి హెచ్చరించారు. సోమవారం తెలుగు దండు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు నాట ఆంగ్లభాష అమలకు పెద్ద పేట వేయడం తెలుగు పట్ల నిర్లక్ష్యం చేయడం కాదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో మాతృభాష పరిరక్షణ ఉద్యమాన్ని చూస్తారని హెచ్చరించారు. తెలుగును ఓ పాఠ్యాంశంగా కాకుండా... తెలుగు భాషలో ప్రాథమిక విద్యాబోధన చేసి ఆంగ్లాన్ని పాఠ్యాంశంగా భోదన చేయాలన్నారు. తెలుగుభాషను అవమానించిన, నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వాన్ని.. ఈ తెలుగునేల పొరపాటున కూడా క్షమించలేదన్నారు. గత ప్రభుత్వం తెలుగుభాషను దుంపనాశనం చేసిందని కబుర్లు చెప్పిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఏదేవా చేశారు.

"మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ"ను ఏర్పాటు చేసి, తెలుగుభాష రక్షణకు గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 18వ తేదీ నుంచి జరిగే..అసెంబ్లీ సమావేశాలకు వెళతామని, అసెంబ్లీ ప్రాంగణం ముందే... తెలుగుభాష రక్షణ గురించి కూటమి ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకొంటామని తేల్చి చెప్పారు. సమావేశంలో వేదుల కామేశ్వర శర్మ, సిహెచ్.చిన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ రాక

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లాలో ఒకరోజు పర్యటన నిమిత్తం ఈ నెల 17వ తేదీ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ రానున్నారు. ఆరోజు ఉదయం 10-00 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 11-15 గంటలకు బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్ కు చేరుకుంటారు. అక్కడినుండి ఉదయం 11-25 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో గల ఏ.యు. సాగరిక ఫంక్షన్ హాల్ చేరుకుని, ఉమన్ అండ్ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం 12-00 గంటల నుండి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సాయంత్రం 3-00 గంటలకు హొటల్ రాడిసన్ బ్లూలో జరిగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొంటారు. అనంతరం గుంటూరు జిల్లా, తాడేపల్లి బయలుదేరి వెళతారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పర్యటించి బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించి అధికారులకు సూచనలు చేశారు.

పోలీస్ డాగ్ కెనాల్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖలోని పోలీస్ మైదానం వెనుక ఏర్పాటు చేసిన కెనాల్ డాగ్ షెల్టర్‌ను సోమవారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, మేయర్ పీలా శ్రీనివాస్ ప్రారంభించారు. 21 రకాల జాతుల డాగ్స్ ఈ సెంటర్లో ఉన్నాయి. నేరాలలో పాల్గొన్న నేరస్థులను ట్రాక్ చేయడానికి, గంజాయి, మాదకద్రవ్యాల రవాణాను గుర్తించడానికి నైపుణ్యం పొందిన ఈ డాగ్స్ వివరాలను సిబ్బందిని అడిగి కమిషనర్ తెలుసుకున్నారు. కొత్తగా శిక్షణ పొందిన 08 నార్కోటిక్ డాగ్స్‌లలో, 05 జిల్లా కలెక్టర్ స్పాన్సర్ చేయగా, 03 నార్కోటిక్ డాగ్స్‌లను విశాఖపట్నం జీవీఎంసీ స్పాన్సర్ చేసింది. కొత్త కెన్నెల్స్ ఏపీలోనే అధునాతన సదుపాయాలతో కెనాల్ డాగ్ సెంటర్ను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు.

చిల్డ్రన్ ప్లేయింగ్ ఏరియా ప్రారంభం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో పిల్లలు ఆడుకునే పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు, టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, పెద్దాడ సోము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, దొమ్మేటి పెరుమాళ్, కడవల రమణ, బస అప్పల రెడ్డి, మోల్లీ అప్పారావు, మొల్లి సోము నాయుడు, దొమ్మేటి సోమునాయుడు, కన్నయ్య రెడ్డి, సింహాద్రి, చౌదరి పాల్గొన్నారు.

గణేష్ థియేటర్ ముందు స్టాపర్లను తొలగించాలి

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలసలో స్థానిక గణేష్ థియేటర్ ముందు థియేటర్ యాజమాన్యం ఏర్పరిచిన స్టాపర్‌ల వలన వాహనాదారులకు, ఆ రోడ్‌లో నివాసముంటున్న నివాసితులకు, వ్యాపారస్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తక్షణమే తొలగించి న్యాయం చేయాలంటూ ప్రజా ఫిర్యాదు వేదికలో భీమిలి జోనల్ కమిషనర్‌కు వ్యాపారస్తులు వినతి పత్రాన్ని అందించారు. దీనిపై కమీషనర్ స్పందిస్తూ విచారణ జరిపి న్యాయం చేస్తామని ఫిర్యాదుదారాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పిట్టా సురేష్, సుబ్బారావు, వ్యాపారస్థులు కొల్లా మహేష్, జనసేన నాయకులు రామోజీ సతీష్, ఆనంద్, శ్రీను మాస్టర్, నానీ, ఓబ్బిలేశెట్టి రాజు, మురళీ, మూర్తి, రాజు, సాయి కొల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నయ్యపాలెం గ్రామస్తులు ఆందోళన

గంటపాటు వాహనాలు అడ్డగింత

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో కుసులవాడ పంచాయతీ చిన్నయ్య పాలెం గ్రామస్తులు సోమవారం వాహనాల రాకపోకలను సుమారు గంటపైగా అడ్డగించారు. ఇదివరకు తమ గ్రామం వద్ద బస్సులు ఆగేవని ఇప్పుడు ఆగడం లేదని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆస్పత్రికి వెళ్లే వారు వాహన రాకపోకలు సాగించేవారు తరచు ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయమని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. బస్సులు లేక నిర్ణీత సమయంలో గమ్యానికి చేరలేక ఇబ్బందులు పడుతున్నామని, బాలింతలు విద్యార్థులు తరచూ ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులకు చెప్పినప్పటికీ గ్రామస్తుల సమస్య పరిష్కారం కాలేదని, అధికారులు స్పందించకపోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసామని వెంటనే రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేసి ప్రభుత్వ బస్సులు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

జీవీఎంసీ ఇంజనీర్లను ఘనంగా సన్మానించిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది వారని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఇంజనీర్లను డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరావుతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది వంటి వారని, వారిని గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశంలో ఇంజనీర్ల పితామహుడు పండితుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ వల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు దిలీప్, మురళీకృష్ణలతోపాటు పలువురు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు, డ్రైనేజీ సమస్యను తీర్చండి

ఎంపీడీవోకు గొల్లలపాలెం వాసులు వినతి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో అనంతవరం పంచాయితీలో గొల్లలపాలెం గ్రామస్తులు స్థానిక ఎంపీడీవో ఎం.విజయకుమార్‌ను కలిసి సమస్యలపై విన్నవించుకున్నారు. తమ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేగినందున డ్రైనేజీ నిర్మించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. గొల్లలపాలెం గ్రామంలో పూర్వం నుండి ఇప్పటి వరకూ డ్రైనేజీ నీటి సమస్య ప్రజల జీవనాన్ని నాశనం చేస్తుందని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపునీరు, ఇంట్లో వాడకం నీరు బయటకు పోవుటకు మార్గం లేకపోవడం వల్ల ఈ నిల్వ నీరు మొత్తం గ్రామంలోనే ఉండిపోతోందన్నారు. ఎన్ని పర్యాయాలు విన్నపాలు చేసినా ఫలితం మాత్రం శూన్యంగా వుందని, మానవతా దృక్పదంతో సమస్యను పరిశీలించి వీలైనంత తొందరగా ఈ డ్రైనేజీ సమస్యను, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిలో కోరారు.

నడ్డా ఆధ్వర్యంలో ఫార్మా రంగ స్టేక్‌హోల్డర్స్ సమావేశం

ఫార్మా, మెడికల్ డివైసెస్ అభివృద్ధిపై డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విన్నపం

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఫార్మా రంగ అభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై హొటల్ దేవి గ్రాండ్ ఇన్‌లో జరిగిన స్టేక్‌హోల్డర్స్ సమావేశానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత చర్చలు జరిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్‌సి లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కూడా పాల్గొని మంత్రికి పలు అంశాలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మా రంగంలో జాతీయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని కోరారు. పరిశ్రమల విస్తరణతోపాటు మెడికల్ డివైసెస్ తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో మెడికల్ డివైసెస్ మార్కెట్ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువ కలిగి ఉండగా, 2030 నాటికి అది 50 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందని అంచనా వేయబడిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాలు మెడికల్ డివైసెస్ తయారీకి అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఔషధాల తయారీలో భారత్ ప్రపంచానికి 'ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్'గా నిలిచిందని, ఇప్పుడు అదే స్థాయి విజయాన్ని మెడికల్ డివైసెస్ రంగంలో సాధించాల్సిన సమయం వచ్చిందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సిఎం.రమేష్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక రెవెన్యూ బోర్డులు

విశాలాంధ్ర కథనానికి స్పందన
అతిక్రమించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
తహశీల్దార్ ఎస్.శ్రీను బాబు

విశాలాంధ్ర - ఆనందపురం: విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో ఆదివారం ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించారు. ఆనందపురం మండలంలో రామవరం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 1, 54, తవిటి కొండ, ప్రభుత్వ స్థలాల్లో మండల తహశీల్దార్ శ్రీనుబాబు ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ అవినాష్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వరహాలు, ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక రెవెన్యూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించి మొక్కలు నాటినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా తహశీల్దార్ తెలిపారు.

యువత ఉద్యమిస్తేనే ప్రభుత్వం కదిలి వస్తుంది..

ప్రైవేటు వైద్య కళాశాలపై ప్రజాసంఘాల ఆగ్రహం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పక్క దేశాల్లో జరుగుతున్నట్టుగా భారీ ఉద్యమాలు జరగాలని, యువత దీనికి నడుం బిగించాలని ప్రజా సంఘాల నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తులు అభిప్రాయ పడ్డారు. సోమవారం అంబేద్కర్ భవన్లో అంబే ద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెవి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్య కళాశాల నిర్వహిస్తే వైద్య విద్యకు దూరమవుతారని, పేదలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉండదన్నారు. మోడీ ఇండియా ఫర్ సేల్ బోర్డు పెట్టినట్టుగా చంద్రబాబు నాయుడు కూడా ఏపీ ఫర్ సేల్ అని బోర్డు పెట్టి ఎకరం 100 రూపాయలకే విక్రయిస్తున్నారని దుయబట్టారు. డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ రాజకీయ నిర్ణయాల ద్వారానే వైద్య కళాశాలలో ప్రైవేటుపరం చేస్తున్నార న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వజ్జి పర్తి శ్రీనివాస్, సొసైటీ కోశాధికారి జి.సత్యనారా యణ, కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్, డాక్టర్ మోటూరి శ్రీనివాస్, డివైఎఫ్ఐ రాజు,ప్రసాద్, వేమన తదితరులు పాల్గొన్నారు.

నేడు కామ్రేడ్ పోతిన సన్యాసిరావు వర్థంతి

విశాలాంధ్ర - మల్కాపురం: మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పోతిన సన్యాసిరావు 41వ వర్థంతి వేడుకలను ఈనెల16వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు సీపీఐ నేతలు తెలిపారు. మల్కాపురం సిపిఐ గ్రామ మండలిలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించబోయే కార్యక్రమానికి సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్‌కె రహమాన్ హాజరవుతున్నారన్నారు.

ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అప్పన్నను దర్శించుకున్న వీఎమ్మార్డీఏ కమిషనర్ దంపతులు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని వీఎమ్మార్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సతీమణితో కలిసి దర్శించుకున్నారు. కమిషనర్ దంపతులకు దేవస్థానం పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ముందుగా కమిషనర్ దంపతులు కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్వామివారి ప్రసాదాలను కమిషనర్ దంపతులకు అందజేశారు. సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ, వీఆర్వో మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

SBFC
ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270
బహిరంగ ప్రకటన
దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తేదీ: 23 సెప్టెంబరు, 2025 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎకౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎకౌంట్లకు చెందినవి.
వైజాగ్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.43-9-205, గ్రౌండ్‌ఫ్లోర్, సుబ్బలక్ష్మినగర్, రైల్వే న్యూకాలనీ, మోర్ సూపర్‌మార్కెట్ ఎదుట, విశాఖపట్నం-16, ఆంధ్రప్రదేశ్-530016, వైజాగ్, AP00674711,AP00708292
మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంప్రదింపు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ హక్కు కలిగియున్నది.)

టిఎస్‌వి ప్రసాదరావుకు బెస్ట్ హిందీ ప్రచారకుని అవార్డు

విశాలాంధ్ర - తగరపువలస: తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత తొమ్మిదిన్నర సంవత్సరాల నుండి హిందీ భాషను బోధిస్తున్న టి.ఎస్.వి.ప్రసాదరావుకు బెస్ట్ హిందీ ప్రచారకుని అవార్డు లభించింది. ఈ అవార్డును జెసిఐ వైజాగ్ గ్రీన్ సిటీ స్వచ్ఛంద సంస్థ వారు ప్రిజం 110 జెసిఐ వారోత్సవాల్లో భాగంగా జాతీయ భాష అభివృద్ధికి సేవ చేస్తున్న వారిని గుర్తించి సన్మానించినట్లు టి.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. జాతీయ భాష అభివృద్ధికి కృషి చేస్తున్న తన సేవలను గుర్తించి జెసిఐ వైజాగ్ గ్రీన్ సిటీ వారు బెస్ట్ హిందీ ప్రచారికునిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ

కార్యక్రమంలో అధ్యక్షులు సునీత రెడ్డి ప్రాజెక్ట్ చైర్ పర్సన్ డి.సుష్మ, కార్యదర్శి కె.నవ్యత పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత ప్రధానోపాధ్యాయురాలికి అభినందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రథమ స్థానం ఉపాధ్యాయులదేనని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా భీమిలి జీవీఎంసీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవికి ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు తో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్న సందర్భంగా ఆమెను కమిషనర్ అభినందించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా బోధనతో పాటు మంచి పౌరులుగా తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. అలాగే భీమిలి జీవీఎంసీ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కాబడి ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకోవడంతో విశాఖ నగరానికి ఎంతో పేరు ప్రతిష్టలు దక్కాయని అందుకు ఆమెను అభినందించడం జరిగిందన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నతికి నిరంతరం కృషి చేయాలని కమీషనర్ ఆమెకు సూచించారు.

సొంత్యాంలో గ్రామసభ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం సొంత్యాంలో భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారి సంగీత్ మాథుర్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామసభ మండల తాసిల్దార్ రెవెన్యూ సభ నిర్వహించారు సర్వేనెంబర్ 347లో 72 ఎకరాల ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఆ భూములో రైతులు జీడి మామిడి సాగు చేసుకుంటూ ఫల సాయం పొందుతున్నారు. గ్రామసభలో భాగంగా రైతులు అభిప్రాయాలు మేరకు నివేదిక తయారు చేస్తామని

తద్వారా ల్యాండ్ పూలింగ్ చేస్తామని , రైతులందరూ సహకరించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎస్ .శ్రీను బాబు, వీఆర్వో దేవరాజ్, నాయకులు లెంక రాంబాబు, లోకిరెడ్డి. అచ్చిబాబు, పల్లా రమణ, తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

73వ హిందీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: 73వ హిందీ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్లో పక్షోత్సవాలు లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షులు గంట నూకరాజు వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు నెహ్రూ

విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వచ్చే 21వ తేదీ ఆదివారం వ్యాసరచన పోటీలు హిందీ మరియు తెలుగు భాషలో నిర్వహిస్తారు. జాతీయ సమైక్యత మీద చిత్రలేఖన పోటీలు వక్తృత్వపు పోటీలు తెలుగు మరియు హిందీ భాషలలో నిర్వర్తించబడుతుందన్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్-2025లో ఆదర్శ్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: గాయత్రి విద్య పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అమరావతి క్వాంటం హ్యాకథాన్-2025లో పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ హేకతాన్ లో 200 టీమ్స్ వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాలల నుండి పాల్గొనగా, ఆదర్శ్ డిగ్రీ కళాశాలకు సెమీఫైనల్‌లో రన్నర్‌గా రావడం కళాశాలకు గర్వకారణం అని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో క్వాంటం జాబ్ టేకర్ థీమ్‌గా, డాష్ బోర్డు పబ్లిక్ క్వాంటం కంప్యూటింగ్ జాబ్ ఫ్రమ్ ఐబిఎం క్వాంటం ప్రాబ్లం స్టేట్మెంట్ లో ఆదర్శ్ నుండి 2 టీమ్స్ గా విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. పై టాపిక్ లో పాల్గొని రన్నర్‌గా నిలిచి ప్రైజ్ మనీ 5 వేలు అందుకున్న టీం ఎం.ఐశ్వర్య, పి.లోహిత, కే.చంద్రశేఖర్, టి.రోస్లిన్, జీ.భాగ్యశ్రీ, బెస్ట్ పార్టిసిపేషన్ క్యాష్ ప్రైజ్ 4 వేలు అందుకున్న టీంగా పి.శాంతి ప్రియ, డి.నవ్య, ఎల్.మాధవి, ఎ. కుసుమకుమారి, వి.ఆశ్రిత ఉన్నారని తెలిపారు. కన్వీనర్ రాజేశ్వరరావు, రాజ్ కుమార్ లకు ఆదర్శ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ చెక్ అందిస్తూ కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఆదర్శ్ లో ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఎంటర్ప్రెన్యూర్షిప్ ఇన్నోవేషన్ స్టార్ట్ అప్ సెంటర్ ద్వారా విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామని, వీటికి అవసరమైన నైపుణ్యాలు నేర్పిస్తున్నామని, విద్యార్థులు ఎంటర్ప్రెన్యూర్, స్టార్ట్ అప్ స్థాపకులుగా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆదర్శ్ ప్రతిభ విద్యార్థులకు బరోసాగా ఉంటుందని కరస్పాండెంట్ డాక్టర్. టి.థియోఫిలస్ తెలిపారు.

జీవిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 111 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 111 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణ మూర్తి, ఎస్.ఎస్.వర్మలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 111 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 32, 3వ జోన్ కు 20, 4వ జోన్ కు 09, 5వ జోన్ కు 21, 6వ జోనుకు 09, 8వ జోన్ కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %ఌ% అకౌంట్సు విభాగమునకు 02, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 13, పట్టణ ప్రణాళిక విభాగమునకు 51, ఇంజినీరింగు విభాగమునకు 28, మొక్కల విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 03 కలిపి మొత్తంగా 111 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ

కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు పి.వి.వి. సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఏ.ప్రభాకర రావు, పర్యవేక్షక ఇంజనీర్లు పల్లమరాజు, కె.శ్రీనివాసరావు, సంపత్ కుమార్, గోవిందరావు, డిడిహెచ్ ఎం.దామోదర రావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, పిఒ-యుసిడి పి.ప్రసన్నవాణి, డిపిఓ శాంతి కుమారి, డీసీపీలు హరిదాసు, మధుసూదనరావు, రామమోహనరావు, ఏసీపీ లు, సివిఒ డా.ఎల్.రాజా రవికుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, టి.పి.ఆర్.ఒ రజినికుమారి, తదితరులు పాల్గొన్నారు.

'డబ్ల్యూటీఐటీసీ' జాయింట్ సెక్రటరీగా 'ప్రణీత కోట్ల'

విశాఖ టెక్కీ ప్రతిభకు దేశ, విదేశల్లో ప్రశంసలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖలో చదువుకుని, క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించిన ఓ యువతి, తన కుటుంబంతో సహా హైదరాబాద్‌లో స్థిరపడి%శీ%ది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఇప్పుడు ఏకంగా అమెరికాలో ఉద్యోగం సంపాదించి సాఫ్ట్‌వేర్ రంగాన్నే ఏలేస్తోంది. ఆమె పేరు 'ప్రణీత కోట్ల'. తెలుగు యువతి 'ప్రణీత కోట్ల'కు ఒక అద్భుత పదవి దక్కింది. ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) మహిళా విభాగ ఎన్ఆర్ఐ జాయింట్ సెక్రటరీగా ఆమె ఎంపికయ్యారు. ప్రణీత కోట్లకు ఇంటెలిజెంట్ ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో దాదాపు 12 ఏళ్ల అనుభవం ఉంది. అంతేకాకుండా ఆమెను డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు కొత్త దారులు చూపించిన ట్రయిల్ బ్లేజర్ అనొచ్చు. ప్రస్తుతం 'ఈఆర్పీ స్మార్ట్ ల్యాబ్'లో ఆమె రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ డెవలెపర్‌గా పని చేస్తూ, ఆయా కంపెనీలకు కోట్లాది రూపాయల్ని ఆదా చేస్తోంది. అంతేకాకుండా వ్యాపార విధానాల్ని పూర్తిగా మారుస్తూ పలు విప్లవాత్మక కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. వృత్తి రంగానికతీతంగా, ప్రణీత ఐఈఈఈ నార్త్ కరోలైనా కౌన్సిల్ వైస్‌చైర్‌గా, కరోలైనా ఉమెన్ ఇన్‌టెక్‌లో టెక్ లీడ్‌గా పని చేస్తూ మహిళా ప్రొఫెషనల్స్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాబోయే తరం నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. కార్పొరేట్ స్థాయికే పరిమితం కాకుండా, ప్రణీత ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని నిపుణులే చెబుతున్నారు. ఇప్పటి వరకు ఆమె 10కి పైగా అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ల్లో కీనోట్ స్పీచ్ ఇచ్చారంటే ఆమె ప్రతిభను అర్థం చేసుకోవచ్చు. ఆమె అనేక రీసెర్చ్ పేపర్లు కూడా రాశారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన తెలుగు వర్గానికి చెందిన ప్రముఖ ప్రొఫెషనల్స్‌లో ఒకరిగా కోట్ల ప్రణీత నిలిచారు. ఈ సందర్భంగా డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ కుమార్ మక్తాల

మాట్లాడుతూ 'ఆవిష్కరణలకు లక్ష్యంతో కలిపిన శక్తికీ ఆమె ప్రతీక' అన్నారు. 'ఆమె ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్ని చురుగ్గా ముందుకు తీసుకు వెళ్తున్నారని, ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ధైర్యంగా నాయకత్వ బాధ్యతలు స్వీకరించేలా ప్రేరేపిస్తోంద'ని కొనియాడారు. డబ్ల్యూటీఐటీసీ ఎన్ఆర్ఐ జాయింట్ సెక్రటరీ (టెక్సాస్, యూఎస్ఏ) డి. రామారావు ఈ సందర్భంగా ప్రణీతకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రణీత కోట్ల చిన్న వయస్సులోనే దేశ, విదేశాల్ని ఆకర్షిస్తోంది. ఆమె ప్రతిభ అమెరికానే శాసించినట్టయింది. ఆమె చేస్తున్న వృత్తి అక్కడి నిపుణుల్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఎంతలా అంటే..కోట్ల ప్రణీత ఏకంగా అమెరికా పార్లమెంట్‌లోనే ప్రసంగించేంత స్థాయికి ఎదిగింది. ఐటీ నిపుణులు ఆమెనే ఆదర్శంగా తీసుకుంటున్నారంటే కోట్ల ప్రణీత ప్రతిభను గుర్తించొచ్చు. ఆమె మరిన్ని శిఖరాలు అధిరోహించాలని అంతా ఆకాంక్షిస్తున్నారు. ఆమెకు 'డబ్ల్యూటీఐటీసీ' జాయింట్ సెక్రటరీగా పదవి దక్కడం పట్ల తండ్రి కోట్ల శ్రీనివాసులు, తల్లి, చెల్లి, బంధువులు, సన్నిహితులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

విశాఖపట్నంలో 'కలర్స్ హెల్త్ కేర్ 2.0 ప్రారంభించిన హీరోయిన్ సంయుక్త మీనన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రముఖ హెల్త్ కేర్ సంస్థ 'కలర్స్ హెల్త్ కేర్' సంస్థ విశాఖపట్నంలో తన నూతన బ్రాంచ్‌ను ప్రారంభించింది. రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 'కలర్స్ హెల్త్ కేర్ 2.0'ను హీరోయిన్ సంయుక్త మీనన్ ఆవిష్కరించారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన సౌకర్యాలను ఆమె పరిశీలించి, నిర్వాహకుల ప్రయత్నాలను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరోయిన్ సంయుక్త మీనన్ మాట్లాడుతూ "ఆకర్షణీయ నగరం విశాఖపట్నంలోని ప్రజలకు అందం, ఆరోగ్యం అందించేందుకు 'కలర్స్ హెల్త్ కేర్ 2.0ను తన ద్వారా పరిచయం చేయడం గర్వకారణంగా ఉందన్నారు. నాణ్యమైన సేవలను ఆధునిక టెక్నాలజీతో అందిస్తున్న కలర్స్ హెల్త్ కేర్‌కు అభినందనలు. దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న కలర్స్ హెల్త్ కేర్.. ఇప్పుడు విశాఖ ప్రజల చెంతకు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. విశాఖ అంటే తనకెంతో అభిమానమన్నారు. గతం లో ఇక్కడ షూటింగ్ లు చేశామని గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యం ఉంటేనే ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించగలమన్నారు. ఆరోగ్యము ఉంటేనే అన్ని సాధ్యమవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ వహించాలని సూచించారు. కలర్స్ హెల్త్ కేర్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీ కూన మాట్లాడుతూ "2004లో ప్రారంభమైన కలర్స్ హెల్త్ కేర్ ఇప్పటివరకు వేలాది మంది కస్టమర్లను సేవలందించింది అన్నారు. దేశవ్యాప్తంగా విస్తరణలో భాగంగా విశాఖపట్నంలో బ్రాంచ్‌ను ప్రారంభించాము. ఆధునిక టెక్నాలజీని నిరంతరం జోడిస్తూ సేవలను మరింత బలోపేతం చేస్తున్నాం" అని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటికీ 55 బ్రాంచీలతో విజయవంతంగా నడుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పుడున్న బ్రాంచీలను వచ్చే ఏడాది నాటికి 25 బ్రాంచ్ లు ఏర్పాటు చేయనున్నమని చెప్పారు. ఆపరేషన్స్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ కృష్ణరాజ్ మాట్లాడుతూ 21 ఏళ్లుగా కస్టమర్ల విశ్వాసం, సంతృప్తి మాకు మరింతా కాన్ఫిడెన్స్ పెంచిందన్నారు. వారి అభిలాష మేరకు విశాఖలో ఈ కొత్త బ్రాంచ్‌ను ఏర్పాటు చేశాం అన్నారు. యుఎస్ ఎఫ్డీఏ ఆమోదం పొందిన టెక్నాలజీతో అధిక బరువు, హెయిర్, స్కిన్ సమస్యలకు అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సలను అందిస్తున్నాం" అని వివరించారు. కలర్స్ హెల్త్ కేర్ కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరోయిన్ సంయుక్త మీనన్‌ను చూడటానికి అభిమానులు, అతిథులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మీషో మాల్‌తో డాబర్-రెకిట్ భాగస్వామ్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం: మీషో మాల్ ఎఫ్ ఎంసీజీ ప్లేయర్లు డాబర్ మరియు రెకిట్‌లతో భాగస్వామ్యాలను ప్రకటించింది. వారి విశ్వసనీయ వ్యక్తిగత సంరక్షణ బ్రాండ్‌లను భారతదేశం అంతటా వినియోగదారులకు చేరుస్తుంది. ఈ అనుబంధంతో, డ్యూరెక్స్, మూవ్, వీట్, డెట్టాల్ మరియు డాబర్ వంటి గృహ పేర్లు ఇప్పుడు మీషో యొక్క విలువ-స్పృహ ఉన్న వినియోగదారులకు, ముఖ్యంగా టైర్ 2 ప్లస్ నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ సహకారం నాణ్యమైన ఉత్పత్తులను సరసమైనదిగా మరియు భారతీయ గృహాలకు అందుబాటులో ఉంచాలనే మీషో భాగస్వామ్య నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. విస్తరించిన పోర్ట్‌ఫోలియో వ్యక్తిగత సంరక్షణ విభాగంలో మీషో మాల్ ఉనికిని మరింత బలోపేతం చేస్తుంది. ప్రారంభించిన ఒక నెలలోనే, ప్లాట్‌ఫామ్ హెయిర్ ఆయిల్స్, ఓరల్ కేర్ మరియు పర్సనల్ హైజీన్ వంటి వర్గాలలో ట్రాక్షన్‌ను చూసింది, రూర్కీ, జబల్పూర్, తంజావూర్, నాసిక్ మరియు షిల్లాంగ్ వంటి నగరాల నుండి అధిక ట్రాక్షన్ వస్తోంది.

ముఖ్యంగా, కొత్త ఆన్‌లైన్ దుకాణదారులలో ఎక్కువ మంది టైర్ 2 ప్లస్ ప్రాంతాల నుండి వచ్చారు, ఇది మెట్రోలకు మించి విలువ ఆధారిత ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న అభిరుచిని ప్రతిబింబిస్తుంది.

మీటియర్ 350 శ్రేణి తీసుకువచ్చిన రాయల్ ఎన్ ఫీల్డ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మిడ్ సైజ్ మోటార్‌సైకిల్ విభాగంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, నేడు భారతదేశంలో పూర్తిగా సరికొత్త, రిఫ్రెష్ చేసిన మీటియర్ 350 శ్రేణి ని విడుదల చేస్తున్నామని ప్రకటించింది. బంగారు సూర్యాస్తమయాలు, వైండింగ్ హైవేలు, ప్రశాంతంగా సాగే ప్రయాణాల కోసం ప్రత్యేకంగా తయారైన మీటియర్ 350, దాని స్పష్టమైన క్రూయిజర్ డిజైన్, లక్షణం, సున్నితమైన పనితీరు, రిలాక్స్ రైడింగ్ ఎర్గోనామిక్స్‌తో మిడ్-సైజ్ క్రూయిజర్ విభాగంలో కొలమానాలను నెలకొల్పుతూనే ఉంది. దేశంలో 2020లో విడుదలైన మీటియర్ 350, శ్రమరహితంగా లాంగ్ రైడ్‌లు, మెరుగైన నగర ప్రయాణాలకు ఒక శుద్ధి చేయబడిన, అందుబాటులో ఉండే మోటార్‌సైకిల్‌గా గుర్తింపు దక్కించుకుంది. రిఫ్రెష్ అయిన అవతార్‌లో, మోటార్‌సైకిల్ దాని వేరియంట్‌లలో కొత్త ఫీచర్లు, అప్‌గ్రేడ్‌లతో వస్తోంది- ఏడు అద్భుతమైన కొత్త రంగులలో ఫైర్‌బాల్, స్టెల్లార్, అరోరా మరియు సూపర్నోవా వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది.

మాక్స్‌క్లీన్ 2ఇన్1 ఫ్లోర్ క్లీనర్‌ను పరిచయం చేసిన విప్రో కన్స్యూమర్ కేర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ హౌస్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్ మాక్స్‌క్లీన్ ఫ్లోర్ క్లీనర్, తన తాజా ఆవిష్కరణగా మాక్స్‌క్లీన్ 2ఇన్1 ఫ్లోర్ క్లీనర్‌ను విడుదల చేసింది. ఇది శాస్త్రీయంగా రూపొందించబడిన క్రిమిసంహారకం. ఇది సాధారణ ఫ్లోర్ క్లీనర్‌లా గచ్చును క్రిమిరహితం చేసి కఠినమైన ధూళి, దుమ్మును తొలగించడమే కాకుండా కీటకాలను కూడా అడ్డుకుంటుందని విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎం ఉషాసిస్ సాహో తెలిపారు. ఆకర్షణీయమైన టీవీసీ క్యాంపెయిన్ ద్వారా విడుదలను ప్రకటించిన ఈ ఉత్పత్తి భారతీయుల నివాసాల కోసమే ప్రత్యేకంగా తయారైందన్నారు. శుభ్రత, పరిశుభ్రతను ఒకే అనుకూలమైన దశలో కలపడం ద్వారా రోజువారీ గృహ సంరక్షణకు తెలివైన, మరింత సమగ్రమైన విధానాన్ని అందిస్తుందన్నారు. గృహ పరిశుభ్రత ప్రమాణాలను పునర్నిర్వచించడంలో, ముఖ్యంగా బహిరంగ భారతీయుల నివాసాల్లో పరిశుభ్రతను కాపాడుకోవడం, క్రిములు, కీటకాల బారిన పడకుండా నిరోధించడం రోజువారీ సవాళ్లుగా ఉన్నాయి అన్నారు. ఆ సవాళ్లను పరిష్కరించేందుకు ఈ ఆవిష్కరణ ఒక కీలకమైన ముందడుగుగా మాక్స్‌క్లీన్ 2ఇన్ 1 ఫ్లోర్ క్లీనర్‌ను పరిచయం చేయడం ద్వారా, మార్కెట్లో క్రమం తప్పకుండా క్రిమిసంహారక, కీటకాల వికర్షక లక్షణాలను అందించే కొన్ని బ్రాండెడ్ ఫ్లోర్ క్లీనర్‌లలో ఒకటిగా బ్రాండ్ నిలుస్తోందన్నారు. మాక్స్‌క్లీన్ డ్యూయల్ యాక్షన్ ఫార్ములాతో, వినియోగదారులు ప్రామాణిక సూక్ష్మక్రిమి రక్షణ ప్రయోజనాన్ని పొందుతారు. అలాగే కీటకాల వికర్షణ, సమయం, ఖర్చు ఆదా, కీటకాల ఉనికిని గణనీయమైన తగ్గింపుతో మెరుగైన పరిశుభ్రత ఫలితాలతో పాటు శుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణానికి దోహదం చేస్తుందని తెలిపారు.

ఆన్‌లైన్‌లో మోసాలపై అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించిన ఐ-4సీ అమేజాన్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: హోం వ్యవహారాలు, భారత ప్రభుత్వం ద్వారా స్థాపించబడిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ-4సీ), అమేజాన్ ఇండియాలు ఆన్ లైన్ లో జరుగుతున్న మోసాలు, కుంభకోణాలు పెరుగుతున్న ప్రమాదం నుండి వినియోగదారులను కాపాడటానికి దేశవ్యాప్తంగా రూపొందించిన కార్యక్రమం స్కామ్ స్మార్ట్ ఇండియాను పరస్పర సహకారంతో ప్రారంభిస్తున్నారు. ఈ భాగస్వామ్యం కుంభకోణాల గురించి అవగాహనను అట్టడుగు స్థాయిలకు తీసుకువెళ్లడం, అవగాహన, చైతన్యం మరియు టెక్నాలజీ-సాంకేతికత ఆధారంగా నివారణను కలపడం ద్వారా దానిని అందుబాటులోకి తీసుకురావడం, కార్యాచరణకు వీలు కల్పించడం లక్ష్యం పెట్టుకుంది. 'స్కామ్-ఫ్రీ సెప్టెంబర్' ద్వారా వారానికి ఒకసారి బహు భాషాల్లో సలహాలు కార్యక్రమం మరియు మోసం గుర్తింపు మరియు నివారణ కోసం ఏ ఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి జాతీయ హ్యాకథాన్ లు ఉంటాయని 14 సీ డైరెక్టర్ నిషాంత్ కుమార్, అమెజాన్ ఇండియా లీగల్ విభాగ ప్రతినిధి రాకేష్ భక్షి తెలిపారు.

జాతీయ యోగ న్యాయ నిర్ణేతగా విజ్ఞాన విహార గుడిలోవ వ్యాయామ ఉపాధ్యాయుడు జె.శ్రీను ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం: యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా ఆదివారం నిర్వహించిన ఆన్లైన్ గ్రేడ్-3 జాతీయస్థాయి యోగా పోటీలకు న్యాయ నిర్ణీతల పరీక్షల్లో గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జె.శ్రీను అర్హత సాధించారు. జిల్లా యోగా సంఘం , యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రెసిడెంట్ సి.హెచ్ .వి .నరసింహస్వామి రాజు, జనరల్

సెక్రెటరీ ఎం.అవినాష్ శెట్టి, విజ్ఞాన విహార డైరెక్టర్ శ్రీ దూసి రామకృష్ణ గారు పాఠశాల యాజమాన్యం హర్ష వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 329 ఫిర్యాదులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 329 ఫిర్యాదులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతుల్లో 92 రెవెన్యూ విభాగానికి సంబంధించినవి ఉండగా.. 88 జీవీఎంసీకి, 25 పోలీసు విభాగానికి చెందినవి ఉన్నాయి. మరొక 124

వినతులు వివిధ విభాగాల్లోని సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చాయి. వీటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు డీఆర్వో చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ పరిసరాలలో గీతం స్వచ్ఛభారత్

విశాలాంధ్ర - మధురవాడ: ఇంటర్నేషనల్ హౌస్‌కీపింగ్ వారోత్సవాల సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బంది రుషికొండ పరిసరాలలో సోమవారం తేది:15-09-2025న పెద్ద ఎత్తున స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హౌస్‌కీపింగ్ సిబ్బంది పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని రుషికొండ ప్రదాన రహదారికి ఇరువైపుల వ్యర్థాలను తొలగించారు. గీతం హస్పిటాలిటి విభాగం డైరక్టర్ హేమంత్ బగ్గా పర్యవేక్షణలో వందకు పైగా హౌస్‌కీపింగ్ సిబ్బంది ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హౌస్‌కీపింగ్ వారోత్సవాల సందర్భంగా సిబ్బందికి వివిధ పోటీలను సహితం నిర్వహించనున్నారు.